
# ముల్లెలేని ముసలమ్మ



## శ్రీ లక్ష్మీకాంత మోహన్

నే నావూరు పనుండి వెళ్లాను. వెళ్తూనే, ఆ పోతురాజు చెట్టు దగ్గిరసా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ కొంతమంది జనం మూగివున్నారు. తలా వొకటే మాటాడుతున్నారు. కొంతమంది—మధ్యతరగతికి చెందిన పెద్దలు—ఆ చెట్టు మొదలు చుట్టూ కట్టబడివున్న గచ్చుఅరుగుమీద కూచుని, యీ జనంసంగతి తమ కేమీ పట్టనట్లుగా వున్నారు. నేను ఆ జనంలోంచి తొంగిచూశాను. చింతకొమ్మల్తో వేసిన చిన్న గుడిసె వొకటి అక్కడుంది. ఆ గుడిసెలో వొక యెండిపోయిన ముసలమ్మ కూచుని యేదో గొణుక్కుంటోంది. అందరి ముఖాలూ విచారసూచకంగా వున్నాయి.

"యేమిటి సంగతి?" అని వారిలో వొక స్త్రీని అడిగాను. ఆమె తన కళ్లతో బెదురుగా చూసి, "రాత!" అని నుదురు కొట్టుకొంది.

"భద్దరయ్యగారి ముసిలమ్మ" అని వొక పిల్లికళ్ల కుఱ్ఱాడు అన్నాడు.

నా కేమీ అంతుపట్టలేదు. అడిగినా, యెవరూ వివరించేట్టూ కనపడలేదు. యీ సమయంలో నాదృష్టి వొక ముసలాయనపై బడింది. ఆయన కొంచెం దూరంలో, ఖాళీగా కూచునివున్నాడు.

"యేమండీ, తాతగారూ, ఆ ముసలమ్మ సంగతేమిటి?" అన్నాను.

ఆయన నన్ను యెగాదిగా చూసి, "మనదే వూరు?" అన్నాడు.

"ఆఁ. కీలుగుంటండీ." అన్నాను.

"వొహో. కీలుగుంటేనా? అయితే మీవూరికీ మావూరికీ చుట్టరికంగూడా వున్నది. అంటూ ఆయన యింకేదో సోది ప్రారంభించేడు. కాని, నేను మధ్యలోనే అడ్డుతగిలి, "ఆ ముసలమ్మ సంగతి చెప్పరూ?" అన్నాను.

ముసిలివాళ్లకి సహజమైన ధోరణిలో అయన వొక చాటభారతం చెప్పుకొచ్చాడు. మీ సులువుకోసమని నేను దాన్ని కుదించి మీకు చెపుతున్నాను:

సూరమ్మ పెనిమిటి చనిపోయి యిప్పటికి యాభైయేళ్లపైగా అయ్యింది. వారిది కొంచెం బాగా వున్న కుటుంబమే. ఐతే పిల్లల్లేరు. తానొక్కతే మిగిలింది.

కానైతే, ఆమె మరుదులూ, తోడుకోడళ్లూ, వాళ్ల పిల్లా మేకా-ఆమె తదనంతరం - వారసు లున్నారు. కాని, ఆయింట్లో తానొక్కతే వుండటానికి ఆమెకి మనస్కరించలేదు. తన జన్మస్థలంలో ఆమె అన్నదమ్ము లుంటే, వారి వద్దకి వెళ్లిపోయింది.

ఆమెకప్పటికి ముప్ఫయియే ళ్లుంటాయి. ఆ వయసులో భర్త చనిపోటమంటేనూ, కనీసం వొక్క నిసుగన్నా లేకపోటమంటేనూ యెలా వుంటుందో అందరూ యెరిగిన విషయమే. ఆ బాధ అనుభవించుతూనే ఆమె చిన్నతమ్ముడింటి కొచ్చింది. తమ్ముడి పేరు కోటయ్య. యువకుడు. వివాహమైంది. తన అక్కగారిని యెంతో ఆప్యాయంగా ఆహ్వానించేడు.

కాని, వితంతువైన సూరమ్మ యీ పచ్చని కొంపలోకి రావటం అతని అత్తగారికి యిష్టం లేదు. పైగా, ఆమెరాకవల్ల వీరికి ఆర్థికంగా లాభించేదికూడా లేదు.

ఐతే తన మనసులోని విషయం ఆమె యెవర్తోనూ—ఆఖరికి కూతుర్తోగూడా—అనలేదు. కాని, కాలం వొకతీరుగా వుంటుందా? తన కొడుకులు వారిదగ్గర తనని వుండనీయరని ఆమె అనుమానం. ఐనా యీకాలపు కొడుకులు తల్లిదండ్రులకి కూడు బెట్టే రకమేనా? తనకి వొక్కతే కూతురు. కనక యిక్కడే కాలం నెళ్లమార్చాలనుకుంది. ఇంతలో యీ "తాళు తెగిన ముండ" వచ్చిపడింది. ఈ ద్వేషంతో ఆమెకడుపు వుడికిపోయింది.

అందువల్ల వొకనాడు యెవరూ లేని సమయం చూసి "యేమే, అమ్మాయ్! యెట్లా యీ ముండతో?" అని కూతురుతో వుండబట్టలేక అనింది.

"యేం? యేమి చేసిందేం?" అని కూతు రడిగింది.

"యేమి చెయ్యాలీ? మనది పచ్చని కొంప. యెందుకా ముండ మన యింట్లో?"

"వుంటే మన కేమిలేవే."

"సడే. యిక నువ్వుగూడా దానితర

ఫేనా? అది యిక్కడుంటే నేను వుండను. మా యిద్దర్లో యెవర్నో వొకర్ని......"

"ఐతే, ఆయన యేమంటాడో?"

"యేంటి ఆయన అనేది? ఆడది కాదంటే, మగమనిషి ఔనంటాడా యెక్కడన్నానూ? అదీ గాక-చూడూ—దానివల్ల మనకి తిండిదండగతప్పితే వచ్చేదేమీ లేదు. ఆ ఆస్తిని యెటుదిరిగీ వారసులు......"

మాతురి కేమీ పాలుపోక "సరే. ఆయన్తో చెప్పి చూస్తాలే" అని అన్నది.

## 2

ఆ రాత్రి అన్నీ విన్నాక, "దానిని వెళ్లమనటం తప్పు గాదా? నలుగురూ నోట్లో వుయ్యరా?" అని కోటయ్య అన్నాడు.

"యెందుకూ? మనం యెవరి సొమ్ము తిన్నామని వూస్తారూ?"

"సొమ్మే తినాలీ? అక్కని వెళ్లమనటం చాలదూ?"

"అదిగాదండీ - మీ దంతా వొట్టి పిచ్చినమ్మకంగాని అవి డుండి మన నుద్ధరించే దేంటి చెప్పండి."

"సరే, యింకేం! ఆమాట నువ్వే అను."

"అదేం మాట? నే నెట్లా అంటాను? మీరే అనండి."

"నా నోటితో నేను అనను."

"ఐతే, నేనూ అనను. ఆడది వెళ్లిపొమ్మందనే అపవాదిక నేను మోసేదా?"

"ఐతే తమ్ముడు వెళ్లమన్నాడనే నీలాప నింద నేను పడేదా?"

"సరే. వూరుకోండి."

యెవరూ సూరమ్మతో అనలేదు. కాని తల్లీ కూతుళ్ల మాటివిరుపులూ, ముసముసలూ ఆమె కర్థమైనాయి. ఇక వుండలేక ఆమె అంతట ఆమే పాలపాడులో వున్న తన అక్కగారింటికి వెళ్లిపోయింది. ఇంట్లో అమ్మాకూతుళ్లు వొక దీర్ఘనిశ్వాసం వదిలేరు.

ఆమె అక్కగారి బిడ్డలంతా వ్యక్తత కొచ్చినవాళ్లే. కొందరికి పెళ్లిళ్లుగూడా ఐనాయి.

సూరమ్మ ఆయింటికి రాగానే అంతా సంతోషించేరు; మర్యాదలు చేసేరు. దానికి కారణం "పాపం!" అనేది గాక, ఆమె వెనకాల వున్న ఆ స్తియే నని మీరు గ్రహించగలరు.

పెత్తనం చెలాయించే మన స్తత్వంలో, పరిస్థితుల్లో సూరమ్మ సంస్కారం పొందింది. నలుగురికి తానై నీతులు చెప్పటం, అల్లరి పిల్లల్ని గదమాయించటం, తనకంటే వయసుగలవారికి సలహా యివ్వటం, చీవాట్లు పెట్టటం, యింట్లోని ప్రతి పని తానై పురమాయించటం, సర్దటం, తన కెదురు చెప్పినపుడు సహించకపోవటం-యివీ ఆమె నిత్యకృత్యాల్లో ప్రధాన విషయాలు.

కొంతకాలంపాటు యీవిధానాన్ని యింట్లో అందరూ సహించారు. కాని కాలం జరిగేకొద్దీ—తన దన్నది దమ్మిడీ యివ్వకపోగా - యీవిధంగా చెలాయించటం ఆమె అక్కగారి కోడళ్లకి వెగటుగా తోచింది; ద్వేషం కలిగింది. అంతే గాక, భాగాలు పంపిణీ అప్పుడుగూడా ఆమె కలుగచేసికొంది. యిక దాంతో, వాళ్ల ద్వేషం భగ్గుమంది. చెడామడా తిట్టిపోసేరు.

అక్కగారూ, బావగారూ యెంత బతిమాలినప్పటికీ, "నేను యీ యింట్లో వుండనే వుండను." అంటూ మొరాయించింది. అదే సమయాన-సామెత చెప్పినట్టు-తన తమ్ముడు కోటయ్య వచ్చేడు.

అతను వచ్చిన యెత్తు వొకటి; కాని, యిది అవకాశంగా తీసుకొన్నాడు.

"యెందుకే యీకొంపలో నువ్వూ?" అని చాటుకి బిల్చి అనీ యిదీ నూరిపోసి తనయింటికి తీసుకునిపోయేడు.

సూరమ్మగారి అక్కగారి బిడ్డల్లో భద్రయ్య అనేఅతడు చాలా తెలివిగలవాడు. యీమెమూలకంగా తాను లాభంపొందుదామనే వూహాలో వున్నాడు. అతడొక్కడు తప్పితే సూరమ్మ వెళ్లిపోయినందుకు యెవరూ నిజంగా విచారపడలేదు.

## 3

"నీ భూమి అక్కడెక్కడో యెందుకు? దానివల్ల నీ కేమి సుఖం? చూడూ. ఆ పనంతా నాకు వదిలెయ్యి. నీ తదనంతరం ఆ ఆస్తీఅంతా వారసులకి పోయేదే గదా? ఆ యిల్లూ వాకిలీ వాళ్లని తీసుకోమందాం. పొలమూ అదీ అమ్మకొటానికి ఒప్పించుదాం. ఆ పనంతా నా కొదిలెయ్యి. ఆ డబ్బుని వడ్డీకి యిచ్చుకో...."

అని వొకనాడు కోటయ్య సూరమ్మకి బోధించేడు. ఆమె కా పద్ధతి మంచిగానే తోచింది. యింకేం? కొన్నాళ్లకి ఆభూమిని అమ్మివేసి, డబ్బుని వడ్డీల కిచ్చింది.

అంతా చక్కగా జరుగుతోంది. యింట్లో యెవరూ ఆమెకి యెదురుచెప్పటం లేదు. కోటయ్యఅత్తగారుకూడా, యిప్పుడు చాలా అణుకువగా వుంటోంది. ఆ కుటుంబమంతా, దాని భారమంతా తనదే నన్నట్లుగా సూరమ్మకితోచింది! నిద్రాహారాలు సరిసే లేకుండానే, ఆమె ప్రతిచిన్నపనినీ తాచి చూడసాగింది. పిడకలు చేయటం, పాతి వూడ్చటం, కమతగాణ్ణీ కాపుల్ని తిట్టటం, యిరుగుపొరుగుని దుమ్మెత్తిపొయ్యటం, కూలీలకి గింజలు కొల్వటం—సర్వమూ—ఆమె పనైపోయింది; ఆమె బాధ్యతగా మారింది. ఆమె దృష్టిలో కోటయ్య "బంగారపు తండ్రి!" తన కొక పెద్ద అండ, ఆసరా దొరికినందుకు ఆమె ఉప్పొంగిపోయింది!!

అట్లా కొన్నాళ్లు జరిగింది.

"మంచి పొలం. బంగారం పండుద్ది. అంతా యెగబడకముందే కొనేద్దాం," అని వొకనాడు కోటయ్య తన అక్కగారితో అన్నాడు. ఆమె కది సబబుగానే తోచింది.

రెండెకరాల పొలం కొని, తనపేర వుంటే వారసులు తినిపోతారని, ఆ పొలాన్ని తన తమ్ముడుపేర పెట్టింది! అది పోగా, యింకా ఆమెవద్ద నాలుగు వేల రూపాయల డబ్బు వుంది.

యీ కథా కమామీషు అంతా ఆమె క్కకొడుకైన భద్రయ్యవిన్నాడు. కడుపుల మంటుకుపోయింది. తక్కిన డబ్బులో కొంతన్నా తను హరించట మెలాగా అని ఆలోచనలో వున్నాడు.

అందుకు తగ్గట్టు అతని తల్లికి జబ్బుచేసింది. ఆ వార్త తీసికొని సూరమ్మవద కొచ్చేడు. చూసి వస్తానని తమ్ముడితో చెప్పి ఆమె వెళ్లిపోయింది. యీమె వచ్చినాక ఆమెజబ్బు ముదిరింది. "నా బిడ్డల్ని కనిపెట్టుకొనివుండు" అని చెప్పి వొక రాత్రి ఆమె కళ్లుమూసింది.

తర్వాత చాలాకాలమైనా ఆమె యింకా అక్కడే వుంది. ఆ సమయంలో వ్యాపారం చేయటానికనే వంకతో, కోటయ్యకి తెలీనీకుండా, రహస్యంగా, ఆ నాలుగు వేలూ భద్రయ్య చేజిక్కించుకొన్నాడు.

అట్లా మరికొంతకాలం జరిగింది.

ఆమె కొన్నిరోజులు తమ్ముడియింటి దగ్గా, కొన్ని రోజులు భద్రయ్యయింటి దగ్గా వుంటున్నది. ఆ డబ్బుసంగతి కోటయ్యకి తెలిసింది.

**వెయ్యిరూపాయిలు పొందండి**

సునాయాసముగా ఆర్జించినట్లే మీరు రూపాయిలు పొందగలుగుతారు. నేడే ఈ విలాసానికి వ్రాయండి. Calico Silk Co. Post Box 106, Calcutta 1.

"వాడికి డబ్బెందుకు యిచ్చావు? యింకా నీకు యిస్తాడా?" అని కోటయ్య వొక సందర్భంలో అన్నాడు.

అందుకని ఆమె భద్రయ్యని డబ్బుకోసం తొందరచెయ్యసాగింది. అతను యిదుగో అదుగో అని జరుపుతున్నాడు. ఆమె అక్కడా యిక్కడా, యేడా పెడా, చీవాట్లు తింటూనే బతుకుతున్నది.

ఆమెకి యెనభైయేళ్లు వచ్చినాయి.

కాళ్లూ చేతులూ ఆడినంతకాలమూ బాగానే జరిగింది. యిప్పుడిక కాళ్లూచేతులు పడిపోయినాయి. ఆమెవద్ద వున్న డబ్బు గూడా, ఐపోయింది.

అందువల్ల, "మాయింట్లోనించి పో, ముండా," అని కోటయ్యఅత్త అనింది.

"నా గడప తొక్కమాక," అని భద్రయ్యపెళ్లాం అనింది.

* * *

మీసాలు సవరించి, చుట్టూ చూసి, "అదయ్యా సంగతీ! ఆఁ? పితపకాలం!!" అని ఆ ముసలాయన అన్నాడు.

"ఐతే మరి మంచీ చెడ్డా చెప్పేవారు లేరా వూళ్లో?" అని నేను అడిగాను.

"యెవరికి చెప్పతావు మంచి? యిది చెప్పితే వినే కాలమేనా? అంతా నాకు యివ్వకుండా వాడికెందుకిచ్చావు అంటాడు కోటయ్య. అంతా నాకే యివ్వక పోయావా నేనే పోషించేవాణ్ణి అంటాడు భద్రయ్య. వాడికే యెక్కువిచ్చావు వాడే నిన్ను పోషించాలి అంటాడు కోటయ్య. తమ్ముడికే అంతా దోచిపెట్టావు. వాడే నిన్ను చూడాలి అంటాడు భద్రయ్య. యిక మధ్యలో యెవరన్నా మంచి చెబితే నాలుగు తిడతారేమో నని పెద్దల భయం. అందువల్ల వొక పుణ్యాత్ముడు ఆ గుడిసె వేయించాడు, ఆ ముసిల్ది అట్టా నడిపీధిలో వుండటం చూడలేక!"

"బాగానే వుంది!" అన్నాను.

"అంతే, నాయనా, అంతే. ఆ ముండకి రెండురోజులమట్టీ తిండీ తిప్పలు లేవు! చూడూ పితపకాలం!!! పోనీ యెవరన్నా తీసికెళ్లి, అది కళ్లుమూసుకొనేదాకా యింత పోషణచేస్తారా అంటే, దాని డబ్బుతిన్న వాళ్ళకే పట్టంది, యెవరికి పడుతుంది చెప్పూ?"

"అంతేలెండి"

తర్వాత ఆయన అదీయిదీ సోదిచెప్పి, వస్తానంటూ లేచేడు. అప్పటికి చీకటిపడిం ది., చలిగాలి తోలసాగింది. నేను గుడిసె వద్దకి పోయాను. యెవరో స్త్రీకూలీలూ, పిల్లలూ తప్పితే యెవరూ లేరు. అంతా యేదోజాలిగా చెప్పకొంటున్నారు. ఆ ముసలమ్మ చలిలో మూలుగుతోంది.

